క్లుప్తంగా

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు



బీకేపాలెం(కాకుమాను): గ్రామాలలో రైతుల భూములకు సంబంధించిన సమస్యలను శాశ్వతంగా పరిష్కారించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తహసీల్దార్ బి.వెంకటస్వామి అన్నారు. మండలంలోని బీకేపాలెం పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా రైతులు ఎదుర్కొంటున్న భూసమస్యలను రైతులు సదస్సులలో అర్జీల రూపంలో అందజేసి శాశ్వత పరిష్కారం చేసుకోవాలని సూచించారు. ఈసందర్భంగా భూమి కొలతలకు 7 అర్జీలు, రికార్డులలో నమోదు కొరకు 37 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సర్వేయర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భూ సమస్యలు క్షేత్రస్థాయిలో పరిష్కారం

పొన్నూరు: మండలంలో భూ సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలని తహసీల్దార్ మహమ్మద్ జియావుల్‌హక్ అన్నారు. శుక్రవారం మండలంలోని బ్రాహ్మణకోడూరులో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ప్రజల నుంచి వివిధ సమస్యలపై 24 అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచి కె.అశోక్, డెప్యూటీ తహసీల్దార్ రాజా రమేష్, ఆర్ఐ శ్రీనివాస్, సర్వేయర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

16వ తేదీ నుంచి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ

చేబ్రోలు: చేబ్రోలు మండలంలోని గ్రామ సర్పంచులు, అధికారులు, సచివాలయ సిబ్బందికి నాలుగు రోజుల పాటు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.లలిత శుక్రవారం తెలిపారు. చేబ్రోలు మండల పరిషత్ కారాయలయంలో రెండు బ్యాచ్‌లుగా నిర్వహించనున్న శిక్షణలో భాగంగా 16, 17వ తేదీలలో మొదటి బ్యాచ్‌కు, 18, 19వ తేదీలలో రెండో బ్యాచ్‌కు శిక్షణ ఇవ్వటం జరుగుతుందన్నారు. మండల పరిధిలోని గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులులకు మాస్టర్ ట్రైనీలు శిక్షణ ఇవ్వనున్నారు.

స్వచ్ఛ లక్ష్యం మరిచారు..

- ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లు పునఃప్రారంభించినా ఫలితం సున్నా
- వినియోగంలోనికి రాని షెడ్లు
- రోడ్ల పక్కనే వ్యర్థాలు పోసి తగలబెడుతున్న వైనం

ప్రత్తిపాడు: స్వచ్ఛ భారత్.. స్వచ్ఛ ఆంధ్ర నిర్మాణమే లక్ష్యం.. చెత్త నుంచి సంపద సృష్టించడమే ధ్యేయం .. అంటూ ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రసంగాల్లో ఊదరగొడుతుంటారు. కానీ అవన్నీ చెత్త మీద రాతలేనని తేలిపోతోంది. ఎప్పుడో ఏళ్ల కిందట నిర్మించిన సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్లు(ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లు)ను, ఇటీవల కొలువుదీరిన కూటమి ప్రభుత్వం ఆర్భాటంగా పునఃప్రారంభించినా నిర్వహణ లేమితో కునారిల్లుతున్నాయి. నిరుపయోగంగా మారి సంపద సృష్టి కేంద్రాలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారుతున్నాయి. పేకాటరాయుళ్లకు, మందుబాబులకు అడ్డాగా మారాయి.



గనికపూడిలో పునఃప్రారంభించి వినియోగంలో లేని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్

మండలంలో సెంటర్లు..

ప్రత్తిపాడు మండలంలో మొత్తం 16 గ్రామ పంచాయతీలున్నాయి. ప్రతి పంచాయతీలో ఒక సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్ నిర్మించారు. అయితే దాదాపుగా అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ కేంద్రాల నిర్వహణను అధికారులు పూర్తిగా విస్మరించారు. దీంతో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు ఉండీ ఉపయోగం లేకుండా మారాయి. చాలా గ్రామాల్లో వ్యర్థాలు, చెత్తచెదారాలను రోడ్ల వెంబడి కుప్పలు కుప్పలుగా పడేస్తున్నారు. షెడ్ల పక్కనే వ్యర్థాల కుప్పలు పోసి తగలబెడుతున్నారు.

ఆర్భాటం పనులు..

కూటమి ప్రభుత్వం గద్దెనెక్కిన తరువాత గాంధీ జయంతిని పురస్కరించుకుని మండలంలోని గనికపూడి, కోయవారిపాలెం, తిమ్మాపురం గ్రామాల్లోని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లను అట్టహాసంగా పునఃప్రారంభించారు. రెండు నెలలు దాటినా వాటిని వినియోగంలోనికి తీసుకురాకపోవడంతో రూ.లక్షల వ్యయంతో నిర్మించిన ఈ షెడ్లు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. పగలూ, రాత్రి తేడా లేకుండా మందుబాబులు ఇక్కడే తాగి తందనాలాడుతున్నారు. ఖాళీ మద్యం సీసాలు, తాగిపడేసిన ప్లాస్టిక్ మందు గ్లాసులు షెడ్డుల్లో దర్శనమిస్తున్నారు. మరోవైపు పారిశుద్ధ్య సిబ్బంది గ్రామంలో సేకరించిన చెత్త కుప్పలను శివారుల్లో, ఎక్కడపడితే అక్కడే రోడ్ల వెంట పడేస్తుండటంతో దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు కూడా పెరిగిపోతున్నాయి. ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. పల్లెల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, ఎన్ని కార్యక్రమాలు చేపడుతున్నా అధికార యంత్రాంగం నిర్లక్ష్యంతో అవన్నీ నీరుగారిపోతున్నాయి. మైనర్ పంచాయతీల్లోనే నిర్వహణ ఇలా ఉంటే ఇక మేజర్ పంచాయతీల్లో అయితే వేరే చెప్పనవసరం లేదు.



గొట్టిపాడులో షెడ్డుకు కూతవేటు దూరంలో రోడ్డుపక్కన పడేసిన వ్యర్థాలు

షెడ్డు పక్కనే వ్యర్థాలు పడేసి..

గొట్టిపాడు లాంటి మేజర్ పంచాయతీలో ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డు వినియోగంలో లేకపోవడంతో ఏకంగా జూదరులు షెడ్డులోపల పేకాట కూడా ఆడుతుండటం శోచనీయం. ఈ గ్రామంలో అయితే ఏకంగా షెడ్డుకు కూతవేటు దూరంలోనే వ్యర్థాలు పడేసి అక్కడే కాల్చేస్తున్నారు. ఇదే విషయమై ఈఓపీఆర్డీ రవికుమార్‌ను 'సాక్షి' వివరణ కోరగా ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ల వినియోగించమని ఇప్పటికే పంచాయతీల కార్యదర్శులకు ఆదేశాలిచ్చామన్నారు. మరో వారం రోజుల్లో పునఃప్రారంభించిన వాటితో పాటు అన్ని పంచాయతీల్లోని షెడ్లను వినియోగంలోనికి తీసుకువస్తామని చెప్పారు. నీటి సంఘాల ఎన్నికలు ముగిసిన వెంటనే ఇక షెడ్ల వినియోగంలోనికి తీసుకువచ్చే పనిలో ఉంటామని చెప్పారు.

ధాన్యాన్ని మద్దతు ధరకు విక్రయించుకోవాలి

సాక్షి ఎఫెక్ట్

చేబ్రోలు: గ్రామాలలోని రైతులందరూ తమ పొలాన్ని ఈ పంట, ఈకేవైసీ చేయించుకొని తమ ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు సేవా కేంద్రాల ద్వారా కనీస మద్దతు ధరకి విక్రయించుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ భార్గవ్ తేజ తెలిపారు. శుక్రవారం సాక్షిలో 'కల్లాలు దాటని కన్నీటి వ్యథలు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ వార్తకు ఉన్నతాధికారులు స్పందించారు. రైతులు కౌలు సాగు చేస్తున్నప్పటికి ఈ క్రాప్, ఈ కేవైసీ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు. రైతులు తక్కువ ధరకు ధాన్యాన్ని దళారులకు విక్రయించుకొని నష్టపోవద్దని అవగాహన కల్పిస్తున్నామన్నారు. ధాన్యం విక్రయాలలో రైతులకు సమస్యలు ఎదురైన వెంటనే క్షేత్ర స్థాయి సిబ్బంది ద్వారా త్వరతగతిన పరిష్కరిస్తున్నట్లు జేసీ భార్గవ్ తేజ ఒక ప్రకటనలో తెలిపారు.

యువకుడు ఆత్మహత్యాయత్నం

చేబ్రోలు: కుటుంబ సమస్యల కారణంతో యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన చేబ్రోలు మండలం సుద్దపల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. సుద్దపల్లి గ్రామానికి చెందిన నరేష్, కుటుంబ సమస్యలతో సతమతమవుతున్నాడు. ఈనేపథ్యంలో పురుగు మందు తాగాడు. కుటుంబసభ్యులు గమనించి 108లో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

గడ్డి నిర్మూలన ఉత్పత్తుల్లో ఫ్లోరినేటెడ్ సమ్మేళనాలు

ప్రొఫెసర్ అనీస్ టిల్లీ

చేబ్రోలు: పురుగు మందులు, గడ్డి నిర్మూలన ఉత్పత్తుల్లో ఫ్లోరినేటెడ్ సమ్మేళనాలు ఉండటం వలన ఎక్కువ కాలం నిల్వ ఉండే సామర్థ్యాన్ని పొందటంతో పాటు వ్యవసాయ రసాయనాల అభివృద్ధి జరుగుతుందని ఫ్రాన్స్- లయోన్‌లోని క్లాడే బెర్నార్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ అనీస్ టిల్లీ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ఇండో-ఫ్రెంచ్ ఇంటర్నేషనల్ సెమినార్ ఆన్ 'ఎక్స్‌ప్లోరింగ్ కాంటెంపోరరి విస్తాస్ ఇన్ అప్లయింగ్(ఆర్గాన్) కాటలిసిస్ ఫర్ ఫార్మా ఇండస్ట్రీ: ఫర్ సస్టేయినింగ్ ఫ్యూచర్' అనే అంశంపై మూడు రోజుల పాటు నిర్వహించిన ఇంటర్నేషనల్ సెమినార్ శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ అనీస్ టిల్లీ మాట్లాడుతూ ఫ్లోరినేటెడ్ సమ్మేళనాలు ఔషధాల్లో సమర్థమైన జీవక్రియ పరమైన లక్షణాలను అందిస్తాయన్నారు. క్యాటలైజ్డ్ వ్యూహాల ద్వారా ఈ సమ్మేళనాల తయారీ వేగవంతం అవడంతో పాటు నిర్దిష్టతతో కూడిన ఫ్లోరిన్ సమూహాలను జోడించవచ్చునన్నారు. ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ పి.వెంకటేశు మాట్లాడుతూ ఫార్మాస్యూటికల్ పరిశ్రమలో ఐనిక్ లిక్విడ్స్, డీప్ యుటెటిక్స్ సాల్వెంట్స్ ఉపయోగం ద్వారానే పర్యావరణ అనుకూలత, ఆర్థిక లాభాలు, మెరుగైన ఔషధ నాణ్యత సాధ్యం అవుతున్నాయన్నారు. సెమినార్‌లో ప్రదర్శించిన పోస్టర్‌లలో మొదటి బహుమతి రోహిత్ ఫణీంద్ర, రెండవ బహుమతి అంజిత, మూడవ బహుమతి భవ్యకు అందజేశారు. కార్యక్రమంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ శ్రీనివాసరావు, మద్రాసు ఐఐటీ ప్రొఫెసర్ జి.రమేష్, ప్రొఫెసర్ ఎం.మధుసూధన్, విజ్ఞాన్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ పాల్గొన్నారు.



సెమినార్‌లో పోస్టర్ ప్రదర్శనలో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులను అందజేస్తున్న ప్రతినిధులు

జిగురు అట్టలతో తెల్లదోమ నివారణ



ప్రత్తిపాడు: జిగురు అట్టలతో తెల్లదోమల ఉధృతిని నివారించవచ్చని వ్యవసాయ కళాశాల విద్యార్థినులు రైతులకు సూచించారు. బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వట్టిచెరుకూరులో రసం పీల్చు పురుగులపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మిరప పైరులో రసం పీల్చు పురుగుల్లో ముఖ్యమైనది తెల్లదోమని తెలిపారు. తెల్లదోమ పురుగులు రసం పీల్చడం వలన ఆకుముడత (జెమిని వైరస్) సోకుతుందని, ఇది ఒక మొక్క నుంచి మరొక మొక్కకు వ్యాపించి పంటకు పూర్తి నష్టాన్ని చేకూరుస్తాయని తెలిపారు. వీటి నివారణకు సమగ్ర యాజమన్యం కింద ఎకరా పొలంలో పసుపు రంగు జిగురు అట్టలు ఇరవై ఏర్పాటు చేయాలన్నారు. తామర పురుగు నివారణకు నీలం రంగు జిగురు అట్టలను ఉంచడం ద్వారా మొవ్వ కుళ్లు తెగులును నివారించవచ్చని వివరించారు. కార్యక్రమంలో వీఆర్వో సాంబయ్య పాల్గొన్నారు.

వైల్డ్ లైఫ్ ఫొటోగ్రఫీపై కార్యశాల



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని వృక్ష, సూక్ష్మజీవ శాస్త్రాల విభాగం, ఫారెస్ట్రీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం వైల్డ్ లైఫ్ ఫొటోగ్రఫీపై కార్యశాలను నిర్వహించారు. వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ డాక్టర్ వెంకటరమణ నరేంద్ర, యూనివర్సిటీ ఫొటోగ్రాఫర్ గుత్తా సునీల్ కుమార్ వివిధ అంశాలపై విద్యార్థులకు మెలకువలు వివరించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ సఫారీలను సందర్శించి జీవవైవిధ్యాన్ని ఆయన తన కెమెరాలో బంధించానని తెలిపారు. విద్యార్థులు ల్యాండ్ స్కేప్ స్కిల్, డ్రోన్, ట్రై ఆర్డర్, ఫొటోగ్రఫీ విధానాలలో మెలకువలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో వృక్ష, సూక్ష్మజీవ శాస్త్రాల విభాగాధిపతి కే మల్లికార్జున, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ దివ్య తేజో మూర్తి పాల్గొన్నారు.

నేడు నీటి సంఘాల ఎన్నికలకు సర్వం సిద్ధం

పొన్నూరు: మండలంలోని శ్రీరంగపురం, సంగం జాగర్లమూడి, కొమ్మమూరి కెనాల్ సాగునీటి కాలువలకు సంబంధించి నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు అధికారుల యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ప్రాదేశిక నియోజకవర్గం (టీసీ)లకు సంబంధించి శనివారం మండల పరిధిలోని 10 సంఘాలకు ఎన్నికలు నిర్వహించి కార్యవర్గాన్ని ఎన్నుకుంటారు. మామిళ్లపల్లి సంఘంలో 7 టీసీలు, దండమూడి 12, నిడుబ్రోలు 9, మాచవరం 10, పొన్నూరు 10, మునిపల్లె 12, జూపూడి 11,న మన్నవ 10, ఉప్పరపాలెం 9, వల్లభరావుపాలెం 12 టీసీలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఒక నామినేషన్ వస్తే ఏకగ్రీవం, రెండు నామినేషన్లు వస్తే ఓటర్ల అభిప్రాయం మేరకు చేతులు ఎత్తించడం లేదా పోటీపడే అభ్యర్థుల పేర్లతో ఓటర్ల స్లిప్‌లు తీయించడం ద్వారా ఎంపిక ప్రక్రియ పూర్తి అవుతోంది. టీసీల్లో ఎంపికైన సభ్యులు అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు. ఉదయం 9.30 గంటలకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతుందని అధికారులు వెల్లడించారు. 10 పోలింగ్ కేంద్రాల్లో 10 మంది అధికారులు ఎన్నికల అధికారులుగా వ్యవహరించనున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మహమ్మద్ జియావుల్‌హక్ నిడుబ్రోలు పురపాలక సంఘ ఉన్నత పాఠశాల ఏర్పాటు చేసిన 309 పోలింగ్ కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు. ఏర్పాట్లపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాస్, ఏఎస్ఓ, సిబ్బంది పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ జియావుల్‌హక్

వ్యాధులను గుర్తించే కొత్త ఆవిష్కరణలు చేపట్టాలి

ఏఎన్‌యూ: ఆక్వారంగంలో వచ్చే వ్యాధులను గుర్తించే విధంగా కొత్త ఆవిష్కరణలు చేయాలని రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని సైన్స్ కళాశాలలోని ఈ అండ్ ఐటీ (ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ) విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ఎంబెడెడ్ సిస్టమ్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ వాటి పాత్ర అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. సదస్సుకు గౌరవ అతిథిగా పాల్గొన్న రిజిస్ట్రార్ మాట్లాడుతూ ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నాలజీని వ్యవసాయ, ఆక్వా రంగంలో కూడా విస్తరింప చేయాలని, మనిషి అవసరం లేకుండా వ్యవసాయ స్థితిగతుల గురించి తెలుసుకునే విధంగా ఆవిష్కరణలు రావాలని సూచించారు. ముఖ్యవక్తగా పాల్గొన్న అమరావతిలోని విట్ ప్రొఫెసర్ అమిత్ చవాన్ మాట్లాడుతూ ఎంబెడెడ్ సిస్టమ్స్ అన్ని రంగాల్లో ఇతర విభాగాలైన ఐఓటీ, కృత్రిమ మేధ, హెచ్ఎంఐలతో కలిపి వినియోగించవచ్చునని తెలిపారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కె.వీరయ్య మాట్లాడుతూ ప్రతి రంగంలోనూ ఇన్‌స్ట్రుమెంటేషన్ అవసరం ఉందని, ముఖ్యంగా వైద్య రంగంలో వీటి అవసరత ఎక్కువగా ఉంటుందన్నారు. ఇన్‌చార్జి ఓఎస్డీ ఆచార్య ఆర్‌వీఎస్ఎస్ఎన్ రవికుమార్ మాట్లాడుతూ ఇన్‌స్ట్రుమెంట్ అవసరం అన్ని రంగాల్లో ఉందన్నారు. అందువల్ల ఈ కోర్సుకి అధిక ప్రాముఖ్యత లభిస్తుందన్నారు. ఫీజిటెక్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ రమణ తేజ వెనిగళ్ల, విశిష్ట ఇన్నోవేటర్స్ మేనేజింగ్ డైరెక్టర్ సాధు సాయి సందీప్ మాట్లాడారు. సదస్సుకు విభాగాధిపతి ఆచార్య సంధ్యకోల్ అధ్యక్షత వహించారు. అధ్యాపకులు డాక్టర్ షర్మిల, కళ్యాణి, రవిచంద్ర పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న రిజిస్ట్రార్ సింహాచలం

వృద్ధులకు చీరలు పంపిణీ

చేబ్రోలు: చేబ్రోలులోని కారుమూరి యశోద ఆనందరావు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వంద మంది వృద్ధులు, వితంతువులకు శుక్రవారం చీరలు పంపిణీ చేశారు. ట్రస్టు చైర్మన్ కారుమూరి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్ ఏఈల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కూచిపూడి రవిశేఖర్ ద్వారా పేదలకు చీరలు అందజేశారు. ప్రతి ఒక్కరూ కష్టాన్ని నమ్ముకొని అభివృద్ధి చెందాలని, అవసరమైనప్పుడు తోటి వారిక సహాయపడే మంచి గుణం ఉండాలని కూచిపూడి రవిశేఖర్ అన్నారు. కార్యక్రమంలో శేకూరు పంచాయతీ కార్యదర్శి బి.ప్రశాంతి, పాస్టర్ సామ్సన్ పాల్గొన్నారు.



చేబ్రోలులోని చెరువులోపాలెంలో వృద్ధులు, వితంతువులకు చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

అందని వేతనాలు.. ఆయాలకు అవస్థలు

వాచ్‌మెన్‌కు 8 నెలలు, ఆయాలకు 6 నెలలుగా ఇదే పరిస్థితి

పొన్నూరు: కూటమి ప్రభుత్వం చిరుఉద్యోగులతో ఆడుకుంటోంది. కొన్ని నెలలుగా జీతాలు చెల్లించడంలో నిర్లక్ష్యం చూపుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే ఆయాలు, వాచ్‌మెన్లు, వంట మనిషి, హెల్పర్లు నెలల తరబడి జీతాలు లేక అవస్థలు పడుతున్నారు. వాచ్‌మెన్‌లకు ఎనిమిది నెలలుగా, ఆయాలకు 6 నెలలుగా వేతనాలు రాక అగచాట్లు తప్పడం లేదు. ప్రభుత్వ పాఠశాలలను శుభ్రంగా ఉంచి విద్యార్థులకు శుభ్రమైన వాతావరణాన్ని అందించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆయాలు, వాచ్‌మెన్లకు సకాలంలో వేతనాలు అందించింది. టీడీపీ కూటమి ప్రభుత్వంలో వారంతా నెలనెలా కష్టాలను ఎదుర్కొంటున్నారు. రోజూ ఉదయం పాఠశాలల పని వేళల కంటే ముందే తరగతి గదులను శుభ్రం చేసి విద్యార్థులు, ఉపాధ్యాయుల బోధనకు అనుగుణంగా పరిసరాలను శుభ్రంగా ఉంచుతున్న వారికి జీతాల కోసం నెలల తరబడి నిరీక్షిస్తూ పడిగాపులు పడుతున్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లోనూ వారు పని చేస్తున్నారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా ప్రతి పాఠశాలకు ఆయాలను నియమించారు. పొన్నూరు మండలంలో 88 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వాటిలో పనిచేస్తున్న ఆయాలు, వంట మనిషి, వాచ్‌మెన్‌లకు జూన్ నుంచి వేతనాలు అందలేదు. వీరికి నెలకు రూ.6 వేలు చొప్పున మండల వ్యాప్తంగా రూ.లక్షల్లో వేతనాలు రావాల్సి ఉంది. వేతన బకాయిలు అందక పూటగడవని స్థితిలో అప్పుల బాట పడుతూ ఇబ్బందులు పడుతున్నారు. అరకొర వేతనాలతో కాలం వెళ్లదీస్తున్న వారికి సక్రమంగా వేతనాలు అందించడం లేదని వాపోతున్నారు.



నిడుబ్రోలు మున్సిపల్ హైస్కూల్

పూట గడవడం కష్టంగా మారింది



పెరిగిన నిత్యావసరాల ధరలతో పూట గడవటమే కష్టంగా ఉంది. పాఠశాలను ప్రతిరోజు క్రమం తప్పకుండా శుభ్రంగా ఉంచుతున్నాం. జీతాలు రాకుండా కుటుంబ పోషణ ఎలా చేయాలి. పని చేయాలంటే ఇబ్బందిగా ఉంది. నెలవారీగా జీతాలు చెల్లిస్తే మా కుటుంబాలను పోషించుకుంటాం. 8 నెలలుగా జీతాలు రాక ఇబ్బంది పడుతున్నాను. ప్రభుత్వం స్పందించి వెంటనే వేతనాలు అందించి ప్రభుత్వం ఆదుకోవాలి.

– సిహెచ్.జగన్, వాచ్‌మెన్. మున్సిపల్ హైస్కూల్, నిడుబ్రోలు

ప్రతి నెలా జీతం ఇచ్చేలా చూడాలి



ఆరు నెలల నుంచి జీతాలు రాక అవస్థలు పడుతున్నాం. పాఠశాల ప్రాంగణంతో పాటు గదులన్నీ ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచుతున్నాం. విద్యార్థులు, ఉపాధ్యాయులకు అసౌకర్యం కలుగకుండా టాయ్‌లెట్లతో పాటు, ప్రాంగణమంతా శుభ్రపరుస్తున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రతి నెలా జీతాలు అందించేలా చర్యలు చేపట్టాలి.

– సుజాత, ఆయా, మున్సిపల్ హైస్కూల్, నిడుబ్రోలు

ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లాం



మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఆయాలు, వాచ్‌మెన్‌లు, వంట మనిషి, సహాయకురాలు జీతాల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. త్వరలోనే వారికి జీతాలు అందించే విధంగా చర్యలు చేపడతాం.


–శ్రీనివాసరెడ్డి. ఎంఈఓ., పొన్నూరు

క్రైస్తవ్యం జీవన విధానం

ఏఎన్‌యూ: ఆదర్శవంతమైన జీవన విధానానికి క్రైస్తవ్యం దోహదపడుతుందని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.గంగాధరరావు పేర్కొన్నారు. విశ్వవిద్యాలయంలోని అధ్యాపకులు, ఉద్యోగులు, పరిశోధకులు, విద్యార్థులు సంయుక్తంగా వర్సిటీ ఎదురుగా ఉన్న పాస్టరల్ సెంటర్‌లో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. వేడుకలకు వ్యాయామ విద్య డైరెక్టర్ ఆచార్య పీపీఎస్ పాల్ కుమార్ అధ్యక్షత వహించారు. వీసీ ఆచార్య గంగాధర రావు మాట్లాడుతూ మాట్లాడుతు క్రైస్తవ్యం మతం కాదని జీవన విధానం అని పేర్కొన్నారు. క్రైస్తవ్యం ద్వారా క్రమశిక్షణ పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో రెక్టర్ కే రత్నషీలా మణి, రిజిస్ట్రార్ జి.సింహాచలం, మంగళగిరి సెంట్ పాల్స్ లూథరన్ చర్చి పాస్టర్ రెవరెండ్ ఎన్.నవీన్, యూజీసీ కో ఆర్డినేటర్ వై.అశోక్ కుమార్, మాజీ ఓఎస్డీ విష్ణువర్ధన్, వికాస అధ్యక్షుడు ఎస్.ప్రసాద్ , కార్యదర్శి జవ్వాజి శ్రీనివాసరావు, డెప్యూటీ ఇంజినీర్ కె.సుబ్బారావు మాట్లాడారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

జువాలాజీ విద్యార్థుల స్టడీ టూర్

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని జువాలజీ విద్యార్థులు స్టడీ టూర్‌ను పూర్తి చేసుకున్నారు. ఆచార్య కే సుమంత్ కుమార్ పర్యవేక్షణలో అధ్యాపకులు ప్రొఫెసర్ పీవీ కృష్ణ, ప్రొఫెసర్ ఎం.జగదీష్ నాయక్ విద్యార్థులకు ప్రాక్టికల్ అనుభవాన్ని పెంపొందించేందుకు స్టడీ టూర్ నిర్వహించారు. చీరాల మండలంలోని వాడరేవులో ఉన్న దత్తాత్రేయ రొయ్యల పెంపకం కేంద్రాన్ని సందర్శించి రొయ్యల పెంపకానికి సరైన నీటి నాణ్యత నిర్ధారించే అధునాతన వాటర్ వడపోత ప్రక్రియను విద్యార్థులు పరిశీలించారు. పెద్దగంజాంలోని మున్నంగి ఆక్వా ఫామ్స్‌లో రొయ్యల పెంపకం, చెరువు తయారీ నుంచి కోత వరకు నీటి నిర్వహణ, వ్యాధుల నివారణ, సమర్థంగా దాణ వినియోగంతో చేపల ఉత్పత్తి ఏవిధంగా జరుగుతుందని అవగాహన పెంచుకున్నారు. అలాగే పిట్టువారిపాలెంలోని రాయల్ మెరైన్ ఫీడ్ మిల్లులో సాంకేతిక నిపుణులతో చేపల్లో ముడి పదార్థాల సోర్సింగ్, పోషక సమతుల్య, ఆక్వా ఫీడ్ ఉత్పత్తిలోని పలు దశలను వివరించారు. అనంతరం క్వాలిటీ కంట్రోల్ ల్యాబ్‌లో ఇంటరాక్టివ్ సెషన్ జరిగింది. బాపట్ల మత్స్య అభివృద్ధి అధికారి రవీందర్, అసిస్టెంట్ డైరెక్టర్ కృష్ణ కిషోర్, విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్ అంజనేయులు, దత్తాత్రేయ రొయ్యల హేచరీ డైరెక్టర్ రాజు, మున్నంగి ఆక్వా ఫాన్స్ ప్రతినిధి రాజశేఖర్, రాయల్ మెరైన్ ఫుడ్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వాహకులు రాధాకృష్ణ తదితరులు విద్యార్థులకు అవగాహన కల్పించారు.



స్టడీ టూర్ లో పాల్గొన్న విద్యార్థులతో ఆచార్యులు